# తెల్ల మొహం

-బులుసు - జీ - ప్రకాష్

★

గేహ యజమాని బంట్రోతు వెంకయ్యను పిలిచాడు. వాడు పరుగెడుతూ వస్తున్నాడు-

"వెంకయ్యా! నేను వీధిలోకి వెళుతున్నాను. నేను తిరిగి గంటదాటితే కాని రాలేను- ఇల్లు మాత్రం జాగ్రత్త! నీకు తెలుసుకదూ, ఇరుగు పొరుగుల్లో దొంగతనాలెటా జరుగుతున్నాయో, కొంచెం జాగ్రతగా ఉండడం మంచిది, చూడు: నేను తిరిగి వచ్చేదాకా ఎక్కడికీ కదలకూ!"

బంట్రోతుకు నచ్చచెప్పి యజమాని ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు.

తాను వెళ్ళగానే తలుపులూ,కిటికీలూమూసేసి వెంకయ్య ఒక విశాలమైన పెద్దహాల్లో కూర్చున్నాడు ఇంట్లో వాడొక్కడే ఒంటిపిల్లి రాకాసిలా ఉన్నాడు, వాడితో డబ్బా కొట్టడానికెవ్వరూ లేకపోవడమే శోచనీయం! ఆ సాయంతనం తనేదైనా పని చేద్దామనుకున్నా ఏ పనీలేదు. సాయంత్రం మాత్రం షికారుకు పోదామనే ఉద్దేశంతో సాయంత్రం చేయవలసిన పని ప్రొద్దున్నే చేసేసి సిద్ధమయ్యాడు. కానీ అలవని తలంపుగా యజమాని ఈ హుస్కుపని అంటగట్టాడు.

వెంకయ్య కాస్తేదో నాలుగైదు తరగతుల వరకూ చదివినవాడే! తన దురదృష్టాన్ని దూషించుకుంటూ ఒక పురాతన కథావికల పుస్తకం చదివి, మళ్ళీ చదివిందే చదువుతూ కొన్ని నిమేషాలు గడిపాడు...మరో కథల పుస్తకం లేకపోవడంవల్ల! కానీ—వాడికా పుస్తకం చదవాలని లేదు...అందులోకీ చదివిందే చదవడం!—

ఆ పుస్తకం తొడమీద పెట్టుకున్నాడు. ఏవో కొన్ని తలంపులు పుట్టాయి. తనెన్నో పుస్తకాలే చదివేశాననీ, పిదప తన యజమానికి బాగా వచ్చిన ఆంగ్లభాషలోకూడా ఉన్న పుస్తకాలు అనేకం చదివేసి విశేషవిజ్ఞానం సంపాదించానని అనుకున్నాడు. తన యజమాని బీరువాలో అనేక రకాలైన హిందీ పుస్తకాలు పడున్నాయ్. లిటరేచర్లు, మేగజైన్లు, జర్నల్సు—అందులో లేవి వేమిటి: కాని అవి తనకెల్లా లభిస్తాయా అన్నది ముఖ్య విషయం! గృహయజమాని బీరువా తాళం వేసుకుని వెళ్ళిపోయాడాయెను. అయినా ఎందుకైనా మంచిదని పుస్తకబీరువా ఉన్న గదిలో పైని ఏమైనా పుస్తకాలు పడుంటాయేమోనని చూడ్డానికి వెళ్ళాడు.

వెంకయ్య వెళ్ళిన క్షణంలోనే ఆశ్చర్యపోయాడు, తన యజమానిగారి తాళాలగుత్తి బీరువా గర్తంలో ఉంది. వెంకయ్య తదేక దృక్కుతో ఆతాళగుచ్ఛంవైపు చూశాడు. ఇక

తను తనకిష్టమైన పుస్తకం తీసి చదువుకోవచ్చు-తనకెవ్వరూ వద్దని చెప్పే తాహతులేదు.

త్వరగా వెళ్లి తాళాలగుత్తిని చేతో పట్టుకున్నాడు. ఆ గుత్తిలో ఒకతాళం మాత్రం మిగతా తాళాలకన్నా పెద్దది. వేంకయ్య ఆతాళాన్ని గుర్తుపట్టాడు. అది తన యజమాని కేష్ పెట్టెది. యజమాని దాన్ని పూర్తిగా మరచి వెళ్ళిపోయాడు.

కాని వెంకయ్య ఒక్కటి మాత్రం మరువలేదు. అది తన బుర్రలో కెన్నోసారులొచ్చింది. ఒక దయ్యం అతని కనేక పర్యాయాలు చెప్పింది —"యజమాని ఎక్కువ సొమ్మును తన పెద్ద పెట్టెలో వుంచాడు." అని.

న్యాయంగా చూస్తే వెంకయ్య చాలా మంచి వాడు. రేపో నాడో పనిలోంచి యజమాని తప్పించేస్తాడు, ముదుసలి కాబట్టి. అంచేతదబ్బు కాజేద్దామని బుద్ధిపుట్టింది, తనకు పట్టిన దయ్యం కూడా అదే ఘనకార్యం చేయమంటూంది. కానీ వెంకయ్య అంతరాత్మ దయ్యానికి వ్యతిరేకంగా వాదించింది తను ఆ భూతాన్ని తిట్టాడు. ఎగతాళికూడా చేశాడు. చివరికి దయ్యమే విజయమర్ధళం మ్రోగించింది.

* * *

వీధి గుమ్మం దగ్గరికెళ్ళి చూశాడు. తలుపుల ఘడీలు సరిగ్గా వేశానోలేదోనని, అన్నీ సరిగ్గానే వేశాడు. మళ్లీ తను పెరటిద్వారం వద్దకెళ్ళి దాని గడియలుకూడా వేసేశాడు. తను తప్పిస్తే అక్కడింకెవరూ లేరు- పచ్చిదొంగలా క్యాష్‌పెట్టె తాళం తీశాడు.

పెట్టె తలుపులు కిర్రుశబ్దంతో తెరువబడ్డాయి. అది చాలా పాతపెట్టె వెంకయ్య తలుపు తీయబడ్డ పెట్టెలోకి తొంగిచూచాడు, ఒక రూపాయిల సంచీ అనేకమైన కరెన్సీ నోట్లు ఉన్నయ్. సంచీ విప్పాడు అందులో చాలా కొత్తరూపాయలూ, నోట్లూ కూడా వున్నాయ్. ఆ సంచిలోని రూపాయిలూ, నోట్లు తన జీవితాంతం వరకూ చాలు ననుకున్నాడు. వాడికా తొందరలోనూ, గాభరాలోనూ నోట్లుగానీ రూపాయిలుగానీ లెఖపెడదామనే కుతూహలం కూడా లేకపోయింది. నోట్ల కట్ట జేబులో పెట్టాడు.

ఇంతలో తలుపు చప్పుడు!....

వేంకయ్య ఉలికిపోయాడు ఎవరై వుంటారో? యజమానే? ఒకవేళ తనే అయితే,- క్యాష్‌పెట్టె తాళాల్ని జ్ఞప్తికి తెచ్చుకుని తిన్నగా ఈ గదిలోకే ప్రథమప్రవేశంగా విస్తాడు. రాడు రాడు! తను యిటువైపు రానేరాడు!

ఒక్కక్షణంలో ఆధనాన్ని యధాస్థలంలో పెటేశాడు. మళ్లీ కొంచెం గట్టిగా తలుపు చప్పుడు!....

వేంకయ్యకు తిరిగీ సరైన తాళం దొరికి వేయడానికి కొన్ని సెకండ్లకాలం పట్టింది.

"ఎవరదీ?" వెంకయ్య మెల్లగా అన్నాడు.

జవాబు నహీ! కానీ ఎవరో మరోసారి చప్పుడు చేశారు.

వేంకయ్య వణుకుతో తలుపు తీశాడు. జై కృష్ణపరమాత్మ! యజమానికాదు. ఎవరో ఒక మూర్తివ్యక్తి నిలబడ్డాడు- ఇంతకు ముందెప్పుడూ వేంకయ్య ఆమనిషిని చూడలేదు. మొత్తంపై అతను క్రొత్తమనిషే. అతను నల్లగా, విషాద ముఖంతో ఉన్నాడు చూడ్డానికి- ఒక తెల్లని ధోవతి, చొక్కా, చొక్కాపైనుంచి ఒక నీలి

రంగు శాల్వ చుట్టూ కప్పేసుకున్నాడు. వేంకయ్య అతనివైపు తీక్ష్ణంగా వీక్షించాడు. కాని అతని విషయమేమీ గ్రహించలేకపోయాడు.

"మీకేమిటి కావాలి బాబూజీ?" వేంకయ్య అతి వినయవిధేయతలు కలవానిలా నటించి ప్రశ్నించాడు. కానీ తనకు లోలోపల ఈ క్రొత్త వ్యక్తిపై కోపం ఉంది. ఎంచేతనంటే తను మహా లాభఘనకర్జం చేస్తుంటే ఇతను అడ్డుతగిలేడు విఘ్నమేకదూ?

అతనన్నాడు: "శివయ్యగారి కోసంవచ్చాను"

"ఆయ నింట్లోలేరు, ఇప్పుడు రారు. తిరిగి వచ్చేసరికి చాలా టైమవుతుందని నా ఉద్దేశం."

"సరేలే! నేనంతవరకూ ఉంటాను" అన్నాడతను—"నేను చాలా దూరప్రదేశం నుంచి వచ్చాను. నేను ప్రత్యేకంగా శివయ్యగారికోసమే వచ్చాను. నాకెక్కడికీ వెళ్లాల్సిన పనిలేదు. నాకీ పట్నంలో చుట్టాలు పక్కాలు అసలు లేనేలేరు.- ఒక్క శివయ్యగారే, ఆయనే నాకు సర్వస్వం"

ఈమాట వినగానే వేంకయ్య గుండెలో పిడుగు పడ్డట్టయింది. లోలోపుల చాలా చికాకు పడ్డాడు. ఎన్నోసార్లు ఆవ్యక్తిని దూషణల్తో భూషించాడు,

"యజమానిగారు చాలా అర్జంటు పనిమీద వెళ్లారు. వచ్చేసరికాలస్య మౌతుంది, మీరింకా ఇక్కడాగడంవల్ల లాభం శూన్యమని నా ఉద్దేశం"

క్రొత్త వ్యక్తి నెమ్మదిగా అన్నాడు. "యజమాని రావడం పూర్తిగా ఒకదినం అయినా ఇక్కడే ఉంటాను. ఉండితీరాలి."

వెర్రికోపం వచ్చింది వెంకయ్యకు. కానితనేం చేయగలడు? పెద్ద విశాలమైన హాల్లో సోఫా

—: ఆవిష్కరణ :—



"అయ్యో!! తాము పొరబడ్డారు, తమరు ముసుగుతీసి ఆవిష్కరణమహోత్సవం జరుపవలసినది ఈ ప్రతిమ కాదు—అక్కడ దేశనాయకుని చిత్రపటాన్ని ఆవిష్కరించాలి!"

---

చూపించి కూర్చోమని చెప్పి, తను లోనికి పోయాడు—ఏదో ఆలోచన సాగిద్దామని.

* * *

వేంకయ్యనింకా ఆరోజు ఆదయ్యం చాలా జోరుగా పీడించింది. అంచేత తానొక క్రొత్త ఉపాయం ఆలోచించాడు. నూతన మనిషెవ్వడైతే హాల్లో కూర్చున్నాడో వేంకయ్య- కేష్ పెట్టెగల గదిలో పునఃప్రవేశం చేశాడు. నిశ్శబ్దంగా పెట్టె తెరచి, నోట్లకట్టను-రూపాయిలను ఏకమూటగా కట్టేసి తను ఆమూటవైపు ఒక్కసారి చూశాడు. ఎవ్వడూ ఊహించి చెప్పలేడు దాని విలువ' తనలో తాను నవ్వుకున్నాడు.

వేంకయ్యకి దయ్యం చెప్పిన ఉపాయంచాలా చిన్నదే! మూటపట్టుకుని వీధి గుమ్మంలోకి వది

చాడు .. క్రొత్త మనిషిని లోపల విడిచేసి ఏమైనా ప్రమాదం వస్తే లోపలున్న మనిషిమీద తోసె య్యొచ్చునని అతని ఉద్దేశం!

ఇలా అనుకుంటూ మరికొంతదూరం నడిచే సరికి, శంకరా! తనెవర్ని చూశాడు? యజమాని శివయ్య గేటులోపల్నుంచి నడిచి వస్తున్నాడు నిజంగా వేంకయ్య బెంబేంలెత్తిపోయాడు. కానీ దయ్యం ఒక తరుణోపాయం చెప్పింది

పెద్ద భీషణాట్టహాసారావంతో వేంకయ్య క్రొత్తవ్యక్తి ఉన్న హాల్లోకి వచ్చి, ఆ ధనలక్ష్మిని నూత్న మనిషి కాళ్ళవద్ద పారేశాడు. అతనికి అర్థం విషయం అర్థంకాక తికమకపడుతున్నాడు.

"ఏమయ్యా! ఏమిటీ రభస? నీవు చేస్తున్న పనేమిటో నీకేమైనా తెలుస్తుందా?"

"ఫర్వాలేదు బాబూజీ! ఏమీ ఎరగనట్లు మాట్లాడకు! మాట్లాడినా లాభం లేదు. నీవేమో నన్ను గ్లాసుతో నీళ్లు తెమ్మన్నావ్, నేను తిరిగొచ్చేలోగా ఈపని చేశావ్" అన్నాడు వేంకయ్య,

శివయ్యగారింతట్లో ఇంట్లోకొచ్చారు. తను వేంకయ్య మాటలు విన్నాడు—"ఏమిటోయ్ విశేషం?"

వేంకయ్య యజమాన్ని చూడగానే మర్యాద అభినయిస్తూ—"బాబూ ఈమనిషి వచ్చిదొంగ! వాడేమో మిమ్మల్ని చూడ్డానికొచ్చానని మంచి నీళ్ళు తెమ్మన్నాడు. నేను వెళ్ళివచ్చేలోగా వీడు తాళాలగుత్తి కాజేశాడు. నేను తిరిగి వచ్చేసరికి పెట్టె తలుపుతీసి, డబ్బు పట్టుకుని పారిపోబో యాడు నేను వాణ్ణి ఆపడానికి ప్రయత్నం చేశాను. కాని ఈవెధవ నన్ను పీక నొక్కేసీ త్రోసేశాడు అదృష్టవంతు మరొచ్చారు, హా కృష్ణా ఇంతటి దొంగముండాకొడుకుని నేనెక్కడా చూడలేదు" అన్నాడు.

యజమాని తనకింత మంచి మర్యాదలు తెలిసిన మనిషి బంట్రోతుగా లభించినందుకు చాలా సంతోషించాడు క్రొత్తమనిషివైపు చూశాడు. క్రొత్తమనిషి ధైర్యంగా తన్నుగా చిరునవ్వు నవ్వుతూ నిలబడ్డాడు.

"బాగుంది, దీనిని గురించి నీవేమి చెప్ప దలచావ్?"

"ఏమీలేదు, నిజంగా మీ నౌకరు చెప్పింది అబద్ధం కాకపోవచ్చు. కానీ పోలీసు రిపోర్టు చేసేముందు నాకో చిన్న పని చేసిపెట్టగలరా? మీరు అతనంటే చాలా ప్రేమ కనబరచవచ్చు. అతను చాలా మర్యాదస్తుడు కావచ్చు. బాబూ? నేను కప్పుకున్న శాలువ పైకి తీయరూ?" నూత్న వ్యక్తి దీనంగా ప్రార్థనతో అర్థించాడు,

శాల్వతీయమన్నట్టుగా శివయ్యగారు వేంకయ్య వైపు చూశాడు. వేంకయ్య జాగ్రత్తగా శాలువ తీశాడు. నూత్న వ్యక్తియొక్క మోచొక్కా కర ద్వయం వ్రేలాడుతున్నాయ్ తను తన రెండు హస్తాలనూ కోల్పోయాడు.

* * *

నౌకరు బిక్కచచ్చిపోయాడు, యజమాని సత్యం గ్రహించాడు క్రొత్తవ్యక్తి చిర్నగవుతో అన్నాడు.

"మానవులెంతటి తెలివి లేమివాళ్ళు, నేను మొన్నీ మధ్యనే జరిగిన మద్రాస్‌మెయిల్ ప్రమాదంలో నా రెండు చేతుల్ని పోగొట్టుకున్నాను, కానీ ఎవరికెరుక?—ఈ గేహ యజమాని దాత అని అపాయంలోంచి బైటపడ్డానికి తనకు తోచిన సహాయం చేస్తాడనీ చెప్పగా విని ఇక్కడి కొచ్చాను! కానీ బంట్రోతుమాత్రం. . హరహర మహదేవ!"

పోలీసులు నౌకరుకు బేడీలు వేశాడు వేంక య్యకు దయ్యం యే వుపాయమూ చెప్పలేక పోయింది. "ఏం వేంకయ్యా! ఏమంటావ్?" యజమాని ప్రశ్నించాడు,

వేంకయ్యది 'మాటరాని నోరు'గా మారింది